ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వికేంద్రీకరణ

నేటి నుంచి అమలు : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను ఈ నెల 18వ తేదీ సోమవారం నుండి మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్ అర్జీల స్వీకరణను జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలోనూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చునని తెలిపారు.

రైతుపై బీమా భారం..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులపై పంటల బీమా ప్రీమియం భారం మోపేందుకు ప్రభుత్వం పూనుకుంది. రబీలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చెప్పకనే చెప్పేసింది. గత ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న ఉచిత పంటల బీమా ప్రీమియానికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చేసింది. దీంతో రైతులపై బీమా భారం పడనుంది. డిసెంబర్ నెలాఖరులోపు ప్రీమియం చెల్లించాలని గడువు తేదీ ప్రకటించింది. బీమా ప్రీమియం చెల్లింపు భారం వేయడంపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రబీలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి బ్యాంకులు రబీ సాగుకు సంబంధించి పంట రుణాలు ఇవ్వడం ప్రారంభించాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చెప్పింది. దీంతో వరి రైతులు ఎకరాకు రూ.615 బీమా ప్రీమియం చెల్లించాలి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నుంచి తప్పుకుని రాష్ట్ర ప్రభుత్వమే బీమా కంపెనీని ఏర్పాటు చేసి ముందుకు సాగింది. రెండేళ్లు దాటిన తర్వాత తిరిగి మళ్లీ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు మారినప్పటికీ పంటల బీమా ప్రీమియం మాత్రం రైతులకు ఉచితం చేసింది. ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే చెల్లించేది. దీంతో రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉచిత పంటల బీమాను ఎత్తివేసింది. బ్యాంకుల వద్ద రైతులు పంట రుణాలు తీసుకునేటప్పుడు బీమా ప్రీమియం మినహాయించుకుని రుణం ఇస్తున్న పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో వరిసాగు దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో ఉండగా, బీమా ప్రీమియం కింద రూ.24 కోట్లు వరకూ రైతులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బీమా ప్రీమియం చెల్లింపు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రీమియం కడుతున్నా బీమా వస్తుందా..?

ప్రతియేటా బీమా ప్రీమియం కడుతున్నా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు బీమా సొమ్ము మాత్రం అందని ద్రాక్షగానే ఉంటుంది. నిబంధనల ముసుగులో రైతులకు బీమా సొమ్ము అందడం లేదు. గడిచిన ఐదేళ్లలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు బీమా సొమ్ము ఎంత అందించారో కూడా లెక్కలు చెప్పని పరిస్థితి ఉంది. బీమా ప్రీమియం చెల్లింపుపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, బీమా సొమ్ము అందజేత గురించి ఎందుకు మాట్లాడటం లేదో అర్థం కావడం లేదు. బీమా అనేది ఒక బోగస్‌గా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో రైతులు బీమా ప్రీమియంగా చెల్లించిన సొమ్ము ఎంత.. రైతులకు బీమా సొమ్ముగా అందించింది ఎంతో లెక్కలు తీస్తే బండారం బయటపడుతుంది. రైతులకు బీమా ధీమా లేకుండాపోయిన పరిస్థితి ఏర్పడింది.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం

బీమా ప్రీమియం రైతులే కట్టుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకులు పంట రుణాలు భూయజమానులకే ఇస్తున్నాయి. దీంతో వారి వద్ద నుంచే బీమా ప్రీమియం మినహాయించుకుంటున్న పరిస్థితి కొనసాగుతోంది. దీంతో రైతులకు కౌలుకార్డులు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోతుంది. ఒకే భూమికి రెండుసార్లు బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉండదు. అంతేకాకుండా ఇ-క్రాప్‌లో ఉన్న రైతులే బీమా ప్రీమియంకు అర్హులుగా నిబంధనలు ఉన్నాయి. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు పెద్దగా లేకుండాపోయాయి. దీంతో కౌలు రైతులకు బీమా అందని ద్రాక్షగా మారింది.

> రబీకి రైతులు ప్రీమియం చెల్లించాల్సిందేనంటున్న ప్రభుత్వం
> గత ప్రభుత్వ హయాంలో బీమా ప్రీమియం ఉచితమే
> ఎకరాకు రూ.615 వరకూ రైతులపై భారం
> రెండు జిల్లాల్లో వరి రైతుల నుంచి దాదాపు రూ. 24 కోట్లు వసూలు
> ప్రీమియం కడుతున్నా నిబంధనల పేరిట బీమా సొమ్ము ఎగవేత
> ఇ-క్రాప్‌లో ఉంటేనే బీమాకు రైతులు అర్హులు
> కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరమే

కామన్ సర్వీస్ సెంటర్లుగా సహకార సంఘాలు

> మరిన్ని సేవలందించడమే లక్ష్యంగా ముందుకు
> కరెంటు, ఫోన్ బిల్లులతో సహా 179 సేవలు అందుబాటులోకి
> పెట్రోల్ బంకులు, జనరిక్ మందులు, గ్యాస్ ఏజెన్సీల ఏర్పాటు
> 90 శాతం రైతుల రుణాల వసూళ్లు
> అవినీతి ఆరోపణలపై చట్టపరంగా చర్యలు
> అన్ని సహకార సంఘాల్లోనూ కంప్యూటరీకరణ
> జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు, ప్రజలకు మరిన్ని సేవలందించే విధంగా సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఫోన్, కరెంటు బిల్లుల చెల్లింపుతోపాటు, 179 సేవలు అందిస్తున్నట్లు, ఇప్పటికే జిల్లాలో పలు సంఘాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు. సహకార సంఘాల్లో ప్రస్తుతం అందిస్తున్న సేవలతోపాటు రానున్న రోజుల్లో అందుబాటులోకి రానున్న సేవల గురించి, రైతులకు రుణాల మంజూరు, వసూళ్లు, సంఘాల్లో కంప్యూటరీకరణ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘాల్లో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు వంటి అనేక అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో డిసిఒ మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లో ఏయే సేవలు అందుతున్నాయి?

డిసిఒ: జిల్లాలో 159 సహకార సంఘాలు ఉన్నాయి. రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు డిపాజిట్లు సేకరణ, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయం వంటివి సాగుతున్నాయి. సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా (బహుళార్థక సేవా కేంద్రాలు) మార్పు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి.

ప్రశ్న: కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్పు చేస్తే ఏయే సేవలు అందుబాటులోకి వస్తాయి?

డిసిఒ: ఇప్పుడు అందిస్తున్న సేవలతోపాటు మీసేవా తరహాలో కరెంటు, ఫోన్ బిల్లుల చెల్లింపు, రైల్వే టిక్కెట్ల బుకింగ్, ఇలా దాదాపు 170 సేవలు అందుబాటులోకి వస్తాయి. ఐటి శాఖ ఆధ్వర్యాన ఈ ప్రక్రియ అంతా నడుస్తోంది.

ప్రశ్న: ఇప్పటి వరకూ ఎక్కడైనా ప్రారంభించారా?

డిసిఒ: జిల్లాలోని 159 సహకార సంఘాల్లో 158 సంఘాలకు ఐడి, పాస్‌వర్డులు ఇచ్చాం. ఇప్పటికే చాలా సంఘాలు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారి సేవలందిస్తున్నాయి. గడిచిన ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ రూ.38.77 లక్షలు విలువ చేసే 4,321 లావాదేవీలు జరిగాయి. వీటిలో అత్యధికంగా కరెంటు, ఫోన్ బిల్లులతోపాటు ఇతర సేవలు ఉన్నాయి.

ప్రశ్న: కామన్ సర్వీస్ సెంటర్లలో సేవలతోపాటు ఇంకేమైనా అందుబాటులో ఉన్నాయా?

డిసిఒ: సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ఐఒసిఎ, బిపిసిఎల్ కంపెనీ అవుట్‌లెట్‌లు మంజూరయ్యాయి. ఇప్పటికే టి.నరసాపురం మండలం కె.జగ్గవరం, మల్లుకుంట సంఘాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం మండలం గవరవరం, చాట్రాయి మండలం చిన్నంపేట, పోలవరంలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. ఇంకా ఆగిరిపల్లి, కైకలూరు, ముసునూరు, కొండపల్లి, నారాయణపురంలో జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటు సాగుతోంది. ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీల ఏర్పాటుకు చర్యలు సాగుతున్నాయి.

ప్రశ్న: సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ ఎంత వరకూ వచ్చింది?

డిసిఒ: నాబార్డు నిధులతో దేశవ్యాప్తంగా సహకార సంఘాలకు కంప్యూటరీకరణ ప్రక్రియ సాగుతోంది. దేశవ్యాప్తంగా ఏకీకృత సాఫ్‌వేర్‌తో కంప్యూటరీకరణ జరుగుతోంది. రుణాలు ఎక్కడ కట్టించుకుంటే అక్కడే రశీదు ఇచ్చే అవకాశం ఉంటుంది. ముంపు ప్రాంతంగా ఉన్న పైడిపాక సహకార సంఘానికి మినహా మిగిలిన అన్ని సంఘాలనూ కంప్యూటరీకరిస్తున్నారు.

ప్రశ్న: సహకార సంఘాల ద్వారా రైతులకు ఈ ఏడాది ఎంతమేర పంట రుణాలు ఇచ్చారు? రుణాల రికవరీ శాతం ఎంత ఉంటుంది?

డిసిఒ: ఈ ఏడాది సహకార సంఘాల ద్వారా రైతులకు రూ.6,400 కోట్లు రుణాలు మంజూరు చేశాం. రుణాల వసూళ్లు 90 శాతం వరకూ ఉంటుంది.

ప్రశ్న: సహకార సంఘాల్లో ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డిసిఒ: 78 సహకార సంఘాల్లో, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 52 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సహకార సంఘాల ఎన్నికలు ఎప్పుడు జరిగే అవకాశం ఉంది. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ఏమైనా జరుగుతుందా?

డిసిఒ: డిసెంబర్ నెలాఖరు వరకూ ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో సహకార సంఘాలు నడిచేలా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా ఎన్నికల ప్రక్రియ ఉంటుంది. సహకార సంఘాల్లో జరుగుతున్న కంప్యూటరీకరణలో ఓటర్ల వివరాలు తెలిసిపోతుంది.

ప్రశ్న: సహకార సంఘాల ఆధ్వర్యంలో గొడౌన్ల నిర్మాణం చేయనున్నట్లు తెలిసింది.. నిజమేనా?

డిసిఒ: అతిపెద్ద గొడౌన్ ప్రాజెక్టు, ప్యాడీ ప్రొసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు సాగుతున్నాయి. అందులో భాగంగా కొప్పాక సొసైటీని గుర్తించాం.

ప్రశ్న: పలు సంఘాల్లో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారు?

డిసిఒ: అవినీతి ఆరోపణలు వస్తే ఆడిట్ ద్వారా స్పెషల్ రిపోర్ట్‌లో వెలుగులోకి వచ్చిన అంశాలపై సెక్షన్ 51, 52 కింద విచారణ చేయిస్తున్నాం. నోటీసులు ఇవ్వడం వంటి ప్రక్రియ జరిగిన తర్వాత దుర్వినియోగమైన సొమ్మును కట్టించడం, ఆస్తులను వేలం వేయడం వంటివి చేస్తారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

పెదపాడు :విద్యార్థులకు సమ్మేళనం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముదినేపల్లిలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - పెదపాడు

పెదపాడు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవత మండల కన్వీనర్ కె.రామకృష్ణ, ఎంపిపి స్కూల్ హెచ్ఎం వేల్పుల ప్రభాకర్, శ్రీకృష్ణ గురుకులం స్కూల్ హెచ్ఎం రామాల బెంజిమెన్, ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయంలో కవులు, సెమినార్లు, రచయితల గురించి ఎన్నో పుస్తకాలు అందుబాటులో కలవన్నారు. వాటి గురించి తెలుసుకొని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కొంతమంది కవులు, రచయితల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం ఎనిమిది, తొమ్మిది తరగతుల వారికి 'డిజిటల్ గ్రంథాలయాలు-ప్రాముఖ్యత వాటి ఉపయోగాలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అంతా గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కవి సమ్మేళనంలో కవితల పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. ఈ పోటీలలో స్థానిక పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సాహితీ మిత్రులు ఎల్ఆర్.పోలిశెట్టి, ప్రసాద్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ వారి ఆధ్వర్యంలో రాజు యోగిని సిస్టర్ బికె.లావణ్య వారి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు మెమరీ మేనేజ్మెంట్ అంశంపై ఆధ్యాత్మికతతో కూడిన శిక్షణ సందేశం ఇచ్చారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు భారతదేశంలో మహిళా సురక్ష, యువత పాత్ర, విద్యార్థి దశ ప్రాముఖ్యత అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి స్టాఫ్, లైబ్రరీన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లో ఐబ్రోరియన్ సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : విద్యార్థులతో గ్రంథాలయ నిర్వాహకులు

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా కె.వెంకట సుబ్బారావు, ఇండో సాక్సన్ స్కూల్ ఉపాధ్యాయులు మాక్యు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 6, 7 తరగతులకు మాతృభాష ప్రాముఖ్యత, 9, 10 తరగతులకు సాంకేతికత వరమా? శాపమా? అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అన్ని పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కపల్లిలో భారీ చోరీ

రూ.4 లక్షలు నగదు, 20 కాసుల బంగారం అపహరణ

చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లిలో భారీ చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లి గ్రామానికి చెందిన మందలపు వెంకట రాధాకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం పెద్ద తిరుపతి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయమే వాకిలి శుభ్రం చేయడానికి పనివాళ్లు రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండటం, లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండటంతో అటు యజమానికి, ఇటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలియగానే ఎస్ఐ ఎం.చిరంజీవి అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. కొద్దిసేపటికి ఇంటి యజమాని రాధాకృష్ణ ఇంటికి చేరుకోవడంతో బీరువాలో దాచిన రూ.నాలుగు లక్షల నగదు, 20 కాసుల బంగారం అపహరించినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని నూజివీడు సిఐ రామకృష్ణ సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

> రైతులు, కార్మికులు విజయవంతం చేయాలి
> ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 26న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులను వ్యవసాయానికి దూరం చేసేలా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. దీనిపై రైతాంగ సుదీర్ఘ పోరాట ఫలితంగా మోడీ ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రైతులకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని విమర్శించారు. తక్షణం ఆ హామీలన్నీ అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్‌డిఎ పాలన కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, మన్నవ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఐదేళ్లలో పోలవరం, చింతలపూడి పూర్తి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

మాట్లాడుతున్న ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రానున్న ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్ట్, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. నూజివీడులో ఆదివారం జరిగిన కమ్మవారి వన సమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం పనులు డిసెంబర్ నుంచి ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా మామిడి సాగు చేస్తున్న నేపథ్యంలో త్వరలో రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఇప్పటికే పామాయిల్, ఆక్వా, పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ వెల్లడించారు. తొలుత నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి, టిడిపి నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, ఆళ్ల వెంకట గోపాలకష్ణ, నందిగం సీతారామ తిలక్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆపదలోని మహిళలకు అండగా..

నగరంలో పలుచోట్ల అభయ టీం అవగాహన

షాపింగ్ మాల్‌లో అవగాహన కల్పిస్తున్న అభయ టీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆపదలో ఉన్న మహిళలకు అభయ అండగా ఉంటుందని, ఆపదలో ఉన్నవారు ఎవరైనా వెంటనే తమకు సమాచారం ఇస్తే పది నిమిషాల్లో సహాయం అందిస్తామని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ తెలిపారు. ఏలూరు నగరంలో ఆదివారం రాత్రి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ తన అభయ టీంతో కలిసి నగరాన్ని చుట్టేసారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రస్తుతం ఈ టీం పని చేస్తుంది. ఆదివారం రాత్రి సెలవు దినం కావడంతో నగరంలోని పలు ప్రాంతాలు రద్దీగా ఉన్నాయి. దీంతో అభయ టీం ఆ ప్రాంతాలలో ముమ్మరంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఈ అవగాహనా కార్యక్రమంలో భాగంగా పలు షాపింగ్ మాల్స్‌లో ఎస్ఐ క్రాంతిప్రియ మాల్స్‌లో పనిచేస్తున్న మహిళలకు అభయపై అవగాహన కల్పించారు. ఇక రద్దీగా ఉన్న ప్రాంతాలైన ఆర్ఆర్ పేట ప్రాంతాలలో రోడ్డుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతిప్రియ మాట్లాడుతూ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో రద్దీగా ఉండే పార్కులు, రోడ్లపై ఎక్కడైనా మహిళలు వేధింపులకు గురైనట్లయితే వెంటనే అభయ నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా పది నిమిషాల సమయంలో వారికి సహాయం అందుతుందని తెలియజేశారు. 112 నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన పది నిమిషాల్లో అభయ రక్షక్ టీం అక్కడికి చేరుకుని వారికి సహాయం అందిస్తారని ఆమె తెలిపారు. ఆటో స్టాండ్‌లలో కూడా మహిళలను తరలించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచనలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అభయ టీం మహిళా సిబ్బంది, ఎస్ఐ క్రాంతిప్రియ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నగర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగర పాలక సంస్థ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల జీతాల పెంపుదల కోసం దశల వారి ఆందోళన చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఏలూరు నగర కమిటీ సమావేశం నిర్ణయించింది. యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన కమిటీ సమావేశం ఆదివారం పవర్‌పేట సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశం వివరాలను కార్యదర్శి ఎ.జాన్ బాబు పత్రికలకు విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జీతాల పెంపుదల కోసం వచ్చేనెల మొదటివారం నుంచి దశల వారి ఆందోళనకు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, ఆ పిలుపును ఏలూరులో జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షులు బి.సోమయ్య కోరారన్నారు. విజయవాడ వరదల్లో సేవలందించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన రెండు జతల యూనిఫారం, కుట్టు కూలీలు వెంటనే ఇవ్వాలని అన్నారు. సర్వీస్‌లో ఉండగా చనిపోయిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సమావేశం కోరింది. కార్మికులు పనిచేయడానికి కావలసిన పనిముట్లు, డబ్బాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. తడి చెత్త, పొడి చెత్త పనులు చేపిస్తున్న కార్మికులు చెత్తా చెదారంలో చేతులు పెట్టి పనిచేయాల్సి వస్తుందని, కనీసం మాస్కులు, గ్లౌజులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. వెంటనే ప్రతీ కార్మికుడికి మాస్కులు, గ్లౌజులు ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పనిభారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని, చనిపోయిన వారి ఖాళీలు భర్తీ చేయాలని అన్నారు. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు రావాల్సిన మూడు సంవత్సరాల యూనిఫారం బకాయిలు, మూడు సంవత్సరాల సరెండర్ లీవులు, బకాయిలు, పెండింగ్ డిఎలు చెల్లించాలని అన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ప్రవీణ్, ఏసురత్నం, పంతం చిన్న నాగరాజు, జార్జి, బంగారు వెంకటేశ్వరరావు, దుర్గారావు, జయకుమార్, నూకరాజు, రామకృష్ణ, రాము, మరియన్న, కాళిదాసు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

298 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో, పలువురికి సహాయపడాలనే ఉద్దేశంతో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ముసునూరు గ్రామ టిడిపి కన్వర్ ఇన్‌ఛార్జి గార్లపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో తలశిల ప్రసాద్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విజయవాడ వారి వాసన్ కంటి ఆసుపత్రి అనుభవజ్ఞులైన డాక్టర్లచే ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించగా సుమారు 298 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కొందరికి కళ్లజోళ్లు వేసే విధంగా ఉండటంతో విజయవాడ వాసన్ కంటి ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు, మరికొందరికి ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు మందు ఇవ్వటం జరిగినట్లు సిబ్బంది ఆధ్వర్యంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండేటి బాబి, నక్క యోహాన్, నల్లబోయిన రాంబాబు, శివ పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన వ్యక్తికి పరామర్శ

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు పంచాయతీ 14వ వార్డు నెంబర్ మడకం వెంకటేశ్వర్లు ఇటీవల పాముకాటుకు గురై మెరుగైన వైద్యం నిమిత్తం భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కోలుకొని ఇంటికి తిరిగి వచ్చిన మడకం వెంకటేశ్వర్లును ఆదివారం టిడిపి మండల అధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు, కుక్కునూరు మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, టిడిపి సీనియర్ నాయకులు సరిపల్లి సత్యనారాయణ తన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

అర్హులైన పేదలకు పట్టణంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత చింతలపూడి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులతో దరఖాస్తులు పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం గ్రామ సచివాలయాల వద్ద అర్జీల సమర్పణ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులంతా పాల్గొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, వీటి కోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోడా వజ్రం, ముల్లగిరి నాగేశ్వరరావు, మఠంగి లాజరు, సరిపల్లి లక్ష్మి బాబు, ముల్లగిరి ప్రసాద్, బత్తుల సుధ పాల్గొన్నారు.

దెందులూరు: ఇంటి స్థలం లేని పేదలకు గ్రామాలలో మూడు సెంట్ల స్థలము, గృహ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులతో అర్జీలు ఈనెల 18న గ్రామ సచివాలయాల్లో గ్రామ కార్యదర్శులకు సమర్పించడం జరుగుతుందని బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో, గీత కాలనీ గట్టుమీద, చంద్రబాబు నాయుడు కాలనీ, యాదవ నగర్‌లో ఇళ్ల స్థలాలు లేని పేదలచే అర్జీలు రాయించడం జరిగింది. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య, జిల్లా సమితి సభ్యులు బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్, కె.నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల వద్ద ఆందోళనలు

టి.నరసాపురం : స్థానిక గ్రామ సచివాలయం వద్ద జరిగే ఆందోళన జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం టి.నరసాపురంలోని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద ఇళ్ల పట్టాల కోసం వ్యక్తిగత అర్జీలు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాడికెక్క జయరాజు, పులి సతీష్, బుర్ర రమణయ్య, బయ్యాగాని వెంకటేశ్వరరావు, గుర్రాల లక్ష్మి, సరాయ్య, ఓబేలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అప్పుల బాధ తాళలేక.. మొబైల్ షాప్ నిర్వాహకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అప్పుల బాధ తాళలేక మొబైల్ షాప్ నిర్వాహకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన గొల్ల సద్గుణ రావు(34) స్థానికంగా ఆటోమొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా అతను నిర్వహిస్తున్న దుకాణంలో నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల అప్పుల పాలయ్యాడు. దీంతో అక్కడి నుంచి ఏలూరు నగరానికి ఆదివారం చేరుకున్నాడు. ఏలూరు నిమ్మకాయల యార్డ్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని పి.రాజవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎమ్.మోహన్ కృష్ణ ద్విచక్ర వాహనంపై పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా రహదారిపై ఉన్న గోతిని తప్పించబోయి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 అంబులెన్స్‌లో జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి గ్రామ సమీపంలో ఎస్ఐ పి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ నుంచి గ్రామానికి వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న సంచిలో తెలంగాణకు చెందిన 40 మద్యం బాటిళ్లు గుర్తించినట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

రూ.5,740 స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

కోడిపందేల స్థావరాలపై దాడి చేసినట్లు చింతలపూడి ఎస్ఐ రవీంద్ర్, ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం కొమ్ముగూడెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని పట్టుకొని వారి వద్ద నుంచి ఒక పుంజు, రూ.4,140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జీలుగుమిల్లి : మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కోడి పందేల శిబిరంపై ఎస్ఐ పి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1600 నగదు, ఒక కోడి, కోడి కత్తును స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జోరుగా మద్యం విక్రయాలు

ముదినేపల్లిలో బాటిల్‌పై రూ.50 అదనపు వసూళ్లు
కన్నెత్తి చూడని ఎక్సైజ్, పోలీస్‌లు
పెచ్చు ధరతో మందు బాబులు గగ్గోలు
కుక్కునూరులో ఇళ్ల మధ్యే మద్యం దుకాణం
ఇబ్బంది పడుతున్న మహిళలు
చోద్యం చూస్తున్న అధికారులు

ముదినేపల్లి : మందుబాబులకు అడ్డాగా గురజ రోడ్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలోని గురజ రోడ్డు మలుపు బెల్ట్‌కు అడ్డాగా మారింది. ఈ బెల్ట్ దుకాణాల్లో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు మందుబాబులు చెబుతున్నారు. మండలంలో నాలుగు లైసెన్స్ షాపులు ఉండగా వాటిలో మూడు షాపులు ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్‌లో ఉన్నాయి. ఒక షాపు మాత్రం సింగరాయపాలెంలో ఉంది. కిలోమీటర్ దూరంలోనే లైసెన్స్ షాపులు మూడు ఏర్పాటు చేశారు. ఈ మూడు మద్యం దుకాణాలు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేశారు. ఈ రోడ్లో మూడు మద్యం దుకాణాలు ఉన్నప్పటికీ బెల్ట్ షాపులు కూడా యధావిధిగా నడుస్తున్న సంబంధిత శాఖల అధికారులు అటువైపు చూడడం లేదు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడానికి వీల్లేదు, బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరిక చేస్తున్నప్పటికీ అవేమీ ఇక్కడ పనిచేయటం లేదు. అందుకు విరుద్ధంగా గురజ రోడ్డు సెంటర్ లో బెల్టు షాపులు నిర్వహిస్తూ కొందరు వ్యక్తులు అక్రమార్జన చేస్తున్నారు. క్వాటర్ బాటిల్ ధర రూ.99 కాగా, బెల్ట్‌లో రూ.50 అదనంగా చార్జీ వేసి రూ.150లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిధంగా అధిక రేట్లకు అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. బెల్టుషాపుల్లో ప్రతి బ్రాండ్ బాటిల్‌పై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నట్లు మందు బాబులు చెబుతున్నారు. ప్రధానంగా ఈ గురజ రోడ్డు సెంటర్లో ముగ్గురు వ్యక్తులు బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. వీరిపై గతంలో పలుసార్లు కేసులు నమోదు చేసినప్పటికీ అవేమీ వీరు ఖాతర్ చేయడం లేదు. యధావిధిగా అక్రమ మద్యం విక్రయాలు చేస్తున్నారు. మండలంలోని బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు నెలవారి మామూళ్లు ఇవ్వడంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. రాత్రి లైసెన్స్ షాపులు మూసివేసిన తరువాత నుంచి రాత్రి 1 గంట వరకు, అర్ధరాత్రి మూడు గంటల నుంచి ఉదయం మద్యం దుకాణాలు తెరిచే వరకు అక్రమ మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు గ్రామానికి రెండు నుంచి 5 వరకు ఉన్నట్లు సమాచారం. మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, పోలీసులు స్పందించి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి, అక్రమ మద్యం విక్రయాలు అరికట్టాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

కుక్కునూరు : నివాసాల మధ్యనున్న వైన్ షాప్

కుక్కునూరు : మండల కేంద్రంలో ఉన్న మద్యం దుకాణం వల్ల పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్యే మద్యం దుకాణం ఉండటంతో ప్రధానంగా మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. మద్యం దుకాణం మందుబాబులకు అడ్డగా మారింది. మందుబాబులు దుకాణం వద్దే తప్పతాగి మద్యం మత్తులో మైకంలోకి జారుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాగిన మద్యం సీసాలను ఇళ్ల పరిసర ప్రాంతాల్లోనే పడేసి మద్యం బాబులు రొచ్చుకు పాల్పడుతున్నారు. కాగా దుకాణం సమీపంలోనే కొందరు మందుబాబులు మల, మూత్ర విసర్జన కూడా చేయడంతో వచ్చే దుర్గంధాన్ని భరించలేక పోతున్నామని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లకు ఆనుకొని మద్యం దుకాణం ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లల్లోని గృహిణులు మద్యం దుకాణం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారు. మందుబాబుల అరుపులు, కేకలతో విసిగెత్తిపోతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణం వద్దే తాగి ఖాళీ సీసాలను ఇళ్లకు ఆనుకొని పడేయడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని తక్షణమే ఇళ్ల మధ్య నుంచి తొలగించాలని స్థానికులు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల నీటి హక్కులు కాపాడాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గత వైసిపి ప్రభుత్వంలో చట్ట విరుద్ధంగా కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో కృష్ణానది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని పున్ణసమీక్షించి విజయవాడలోనే ఏర్పాటు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆధ్వర్యాన వినతిని సమర్పించారు. ఆర్ఎంబి కార్యాలయాన్ని గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను అమలుచేసి అన్ని సానుకూలతలు ఉన్న విజయవాడ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం నూజివీడులో ఒక ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీకి ఈమేరకు వారు వినతిని అందజేశారు. ముసునూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ తుమ్మల లక్ష్మణరావు, నూజివీడు నియోజకవర్గ రైతు నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, చెరుకూరి దుర్గాప్రసాద్ తదితరులు పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు.

అనంతరం ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు విజయవాడలోనే కెఆర్ఎంబి కార్యాలయం ఏర్పాటు చేయటానికి ఇబ్రహీంపట్నంలో భవనాలను కూడా చూడటం జరిగిందన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా 2020 జూన్, ఆగస్టులలో కెఆర్ఎంబి కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాసిందని, దీనికి విరుద్ధంగా 2020 డిసెంబరులో కెఆర్ఎంబి కార్యాలయాన్ని కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని అప్పటి వైసిపి ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకోవటం చాలా దారణమన్నారు. ఈ నిర్ణయాన్ని పున్ణసమీక్షించి కృష్ణానది పరివాహక ప్రాంతంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్ కింద ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టుకు అనువుగా కృష్ణానది ఒడ్డున రైలు, రోడ్డు, విమాన సౌకర్యం కలిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కెఆర్ఎంబి దృష్టికి తీసుకు రావటానికి వీలుగా విజయవాడలోనే కెఆర్ఎంబి కార్యాలయాన్ని ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడవ జోన్‌లోని 2.10 లక్షల ఎకరాల్లో ఇప్పటికే రైతులు సాగుచేసిన మామిడి, పత్తి, మిర్చి, జొన్న, పొగాకు, మినుము, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలకు డిసెంబర్ 1వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేయటానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై ఎంపీ పుట్టా మహేష్ కమార్ స్పందిస్తూ నీటి సంఘాల ప్రతినిధులు, రైతు ప్రతినిధులు కోరిన విధంగా కెఆర్ఎంబి కార్యాలయాన్ని రాజధాని అమరావతిలోనే ఏర్పాటు చేయటానికి పార్లమెంటు దృష్టికి, కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి, కృష్ణాజిల్లా పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ గుండపనేని శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ బొర్రా అశోక్ కుమార్, ముసునూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు.

ఎంపీ పుట్టా మహేష్‌కు విజ్ఞప్తి


ఎంపీకి వినతిని అందజేస్తున్న సభ్యులు


ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కొవ్వలి విద్యార్థి

దెందులూరు : జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీలకు మండలంలోని కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి ఇ.చార్లెస్ వెస్లీ ఎంపికయ్యారని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, ఫస్ట్ అసిస్టెంట్ ఎ.సుధారాణి మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాజనందిగంలో జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ అండర్-14 పోటీలకు కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థి వెస్లీ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు సురేష్, శ్రీనును అభినందించారు.

సిపిఎం మండల కార్యదర్శిగా రమేష్

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

కొత్తూరులో జరిగిన 9వ మండల మహాసభలో సిపిఎం మండల కార్యదర్శిగా ధర్ముల రమేష్‌ను ఏకగ్రీవంగా రెండవసారి సభ్యులు ఎన్నుకున్నారు. మండలంలో ప్రజలకు ఎదురవుతున్న పలు సమస్యలపై మహాసభలో ప్రతిపాదించారు. తదనంతరం సిపిఎం నూతన మండల కమిటీని పదిమంది సభ్యులతో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం, ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూముల హక్కులు, స్థానిక సమస్యల పరిష్కారం, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి సాధన, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి కోసం పనిచేయాలని భవిష్యత్తు కర్తవ్యాలను తీర్మానించారు. మండల కమిటీ సభ్యులుగా మడివి దుర్గారావు, కారం వెంకటరావు, కొత్త వెంకటేశ్వర్లు, గుమ్మల వెంకట నర్సయ్య, మడకం ఏసుబాబు, మాడి ప్రసాద్ రెడ్డి, కుంజా దుర్గ, సోడే రూత, శ్రీను ఎన్నికయ్యారు.

రోడ్లకు మరమ్మతులు

పోలవరం : పోలవరం మండల కేంద్రంలో ఆదివారం రోడ్ల మరమ్మతుల కార్యక్రమం ఆర్అండ్‌బి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలవరంలో స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి కచేరి వరకూ రోడ్లపై ఉన్న భారీ గోతులను కంకరు రాళ్లు వేసి గోతులు పూడ్చి రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. స్టేట్ బ్యాంకు నుంచి కచేరి వై జంక్షన్ వరకూ ప్రస్తుతం రూ.9 లక్షల నిధులతో రోడ్ల మరమ్మతుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, రానున్న రెండు వారాల్లో మరో రూ.9 లక్షల నిధులతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ఏటిగట్టు సెంటర్ వరకూ ఉన్న గోతుల పూడ్చివేస్తున్నట్లు ఆర్అండ్‌బి డిఇ సిహెచ్.హరికృష్ణ తెలిపారు.

రైతులకు న్యాయమైన ధర అందించాలి

చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

రైతుల భూముల ధరలు విపరీతంగా పెరిగినందున వారికి న్యాయమైన ధర ఇప్పించవలసిందిగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరినందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల పోరాట సమితి అభినందనలు తెలియజేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల పోరాట సమితి సమావేశం ఆదివారం ఎర్రగుంటపల్లి గ్రామంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ అధ్యక్షతన రాధా గార్డెన్స్ కళ్యాణ మండపంలో సుమారు 30 మంది రైతులతో నిర్వహించారు. ఈ సమావేశంలో ఇక్కడ ప్రస్తుత భూమి విలువ ఎకరానికి రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉన్నందున రైతులకు రూ.50 లక్షలు తగ్గకుండా ఇప్పించవలసిందిగా భూములతో పాటు చెట్లు, బోర్లు, షెడ్లు వివిధ రూపాలలో నష్టపోతున్న వాటికి గత ధరలు కాకుండా ప్రస్తుత ధరలు ప్రకారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పాత అవార్డును రద్దుపరిచి కొత్త అవార్డును ప్రకటించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. గ్రామసభలు నిర్వహించి రైతులతో చర్చించి, రైతులను ఒప్పించి పనులు ప్రారంభించాలన్నారు. భూమి ధరతోపాటు ఆదార్ వేల్యూస్ కూడా కలిపి ఒకేసారి చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ సమస్యలన్నీ ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రం సమర్పించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో దొంత కృష్ణ, చిట్లూరి అంజిబాబు, తెగడ వెంకన్న, కుప్పాల చెన్నయ్య, జగ్గవరపు ప్రసాద్, వనమా ధర్మలింగస్వామి, సత్యనారాయణరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

బైబిల్ ఓపెన్ యూనివర్సస్ ఇండియా ఇంటర్నేషనల్, ఎఐటిసిసి వ్యవస్థాపకులు, జయశాలి పిడి సుందరరావుల ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావు పేటలో గుడారుల నివాసుల వద్ద నిరుపేదలకు దుస్తులు, పండ్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా మహిళా కమిటీ వారి ఆధ్వర్యంలో సిబిటి ఏలూరు ప్రిన్సిపల్ ఉదయ్ భాస్కర్ వాక్య సందేశం అందజేశారు. జయశాలి నేర్పిన క్రీస్తు ప్రేమ, సేవా లక్ష్యంగా నడుచుకోవాలని, భక్తి శ్రద్ధలతో జీవితాన్ని వెళ్లబుచ్చుకుని దైవ మార్గంలో నడవాలని సూచించారు. పిడి సుందరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీధర్ ఆకస్మిక మృతి

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టడానికి చెందిన ప్రముఖ అధ్యాపకులు ఉప్పల శ్రీధర్(63) గుండెపోటుతో ఆకస్మికంగా ఆదివారం మృతి చెందారు. పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీ అధ్యాపకులు శ్రీధర్ స్థానికంగా ఉన్న ధర్మ అప్పారావు కళాశాలలో సుదీర్ఘకాలం కెమిస్ట్రీ అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వర్తించారు. కొన్ని వందల మంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారు. కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీధర్ మృతికి పలువురు విద్యావేత్తలు తీవ్ర సంతాపం ప్రకటించారు.

నేడు అంతర్జాతీయ విద్యా ప్రదర్శన

దెందులూరు: రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 18న అంతర్జాతీయ విద్యా ప్రదర్శన జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ రావు చెప్పారు. ఇది రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ, లీయో గ్లోబల్ ఓవర్సీస్ వారి ఆధ్వర్యంలో జరగనుందన్నారు. ఆదివారం రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 25 ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొననున్నారని ఆయన చెప్పారు. ముఖ్యంగా యుఎస్, యుకె, కెనడా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జర్మనీ, యూరప్ వంటి దేశాల నుంచి ప్రతినిధులు కార్యక్రమానికి హాజరవుతారని వెల్లడించారు. అంతర్జాతీయ విద్యా ప్రదర్శన విద్యార్థుల భవిష్యత్తుకు మెరుగైన అవకాశాలను అందించడానికి, వివిధ దేశాల విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు పాల్గొనే అంతర్జాతీయ విద్యా ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యక్షంగా ప్రతినిధులతో మాట్లాడి కోర్సులు, అర్హతలు, స్కాలర్‌షిప్‌లు, వీసా ప్రక్రియల గురించి వివరంగా తెలుసుకోవచ్చన్నారు. ప్రదర్శనలో విద్యా అవకాశాలపై అత్యుత్తమ విశ్వవిద్యాలయాల కౌన్సెలర్లు అందుబాటులో ఉంటారని వివరించారు. స్కాలర్‌షిప్ సమాచారం కోసం పాఠశాల, గ్రాడ్యుయేషన్ స్థాయిలో విద్యకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటుందన్నారు. స్కాలర్‌షిప్ వివరాల కోసం, వీసా మార్గదర్శకాలు, విద్యార్థి వీసా ప్రక్రియ గురించి స్పష్టత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కౌన్సెలింగ్ కోసం, చదువులో మీకు సరిపోయే కోర్సు, వృత్తి మార్గాలపై సలహాలు, సూచనలు ఇందులో ఇవ్వబడతాయని వివరించారు. ఈ కార్యక్రమం విద్యారంగానికి కొత్త అవకాశాలను, సమగ్ర అభివృద్ధిని అందించేందుకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని మురళీధరరావు వివరించారు. అందరూ ఈ సమావేశంలో పాల్గొని ఈ వివరాలను తమ పాఠకులకు, ప్రేక్షకులకు అందించాలని కోరారు.

గుడి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం పంచాతీ పరిధిలో ఉన్న సూరంపూడిలో గంగానమ్మ గుడి నిర్మాణానికి బొర్రంపాలెం గ్రామానికి చెందిన యువ నాయకుడు, మానవతావాది పెండ్యాల అభిషేక్ బాబు తన గుమస్తా బత్తుల రమేష్ ద్వారా ఆదివారం రూ.20 వేలు గ్రామస్థులకు అందించినట్లు తెలిపారు. అంతేకాక గ్రామంలో ఎంతోమంది పేదలకు తనవంతు సాయం అందిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

నారా రామ్మూర్తికి నివాళులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి క్యాంప్ కార్యాలయంలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ్ముడైన మాజీ ఎంఎల్ఎ నారా రాంమూర్తి నాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. వారికి నివాళులర్పించిన టిడిపి నాయకులు, నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టిడిపికి నారా రాంమూర్తి నాయుడు ఎనలేని సేవలు చేశాడని, పార్టీకి ఎంతో విధేయుడుగా ఉండి పార్టీకి నిబద్ధతో పని చేసేవారన్నారు. అలాంటి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, కుటుంబానికి టిడిపి అండదండలుగా ఉండి అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. ఆయన గొప్ప లక్షణాలు ఉన్న నాయకుడని, క్రమశిక్షణ కలిగిన నాయకుడన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు.

చింతలపూడి : మండలంలోని టిడిపి ఆధ్వర్యంలో శనివారం అనారోగ్య కారణంగా మృతి చెందిన మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడుకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, మాజీ సర్పంచి చిట్లూరి ధర్మరాజు, సీనియర్ నాయకులు అట్లూరి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కార్యదర్శి బోడ నాగభూషణం, మాజీ పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, తిరుమిల్లి రామారావు, రావెళ్ల హనుమంతరావు, కంభం రమేష్, మద్ద పండు, పూడి సుబ్బారావు, వేములపల్లి సూరిబాబు, షేక్ సుభాని, షేక్ బాబు మియా, విష్ణు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తాటి మనీంద్ర సింహ పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా శ్రీనురావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం ఐఎఫ్‌టియు అనుబంధ మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సంయుక్త కార్యదర్శి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో 74 ఓట్ల మెజార్టీతో యర్రా శ్రీనురావు గెలుపొందారు. ఈ సందర్భాన్ని ఉద్దేశించి ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోడీ సర్కార్ కార్మికులపై పెను దాడులు చేస్తున్న నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా తమ హక్కుల కోసం, సంఘటిత ఉద్యమాన్ని చేయవలసిన అవసరం ఏర్పడిందని, ఉన్న చట్టాలను హరించే బిజెపి ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా ఒక సమరశీల ఉద్యమాన్ని చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులందరూ తమ హక్కుల రక్షణ కోసం, యూనియన్ బలోపేతం కోసం ఐక్యంగా కృషిచేయాలన్నారు. ఈ ఎలక్షన్ మీటింగ్‌లో ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర కమిటీ సభ్యులు ఘడసాల రాంబాబు, మంగం అప్పారావు, దూళ్ల వీరి నాయుడు పాల్గొన్నారు.

రావి పద్మకుమారి మృతి బాధాకరం

చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రముఖ వైద్యులు, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మాజీ పర్యవేక్షకులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య భార్య రావి పద్మకుమారి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు సంతాపం తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాలకృష్ణయ్య కమ్యూనిస్ట్ అభిమానిగా అనేక ఉద్యమాలకు, కార్యక్రమాలకు మద్దతు ఇస్తుంటారని తెలిపారు. ప్రముఖ వైద్యులుగా పేరు ఉండటంతో పాటు సేవా తత్పరులని గుర్తు చేశారు. పద్మ కుమారి భర్త గోపాలకృష్ణయ్యతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునే వారన్నారు. ముఖ్యంగా పద్మ కుమారి పేద విద్యార్థులు, మహిళల కోసం సాధన చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారు కొనియాడారు. శుక్రవారం ఉదయం ఆకస్మికంగా పద్మ కుమారి మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆదిశేషు ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని అన్నపూర్ణ ఆసుపత్రి ఆవరణలో మహిళా ఆరోగ్య వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్య వికాస్ కేంద్ర సమన్వయకర్త డాక్టర్ కె.మాధవి రవీంద్ర మాట్లాడుతూ వికాస తరంగిణిగా నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులలో మహిళల్లో ఉండే గర్భకోశ వ్యాధులను గుర్తించడానికి, రొమ్ము కేన్సర్‌లపై పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు దేశంలో వివిధ ప్రాంతాలలో 1,250కి పైగా వైద్య శిబిరాలు నిర్వహించే లక్షలాది మంది మహిళలను మహిళా ఆరోగ్య వికాస్ కాపాడగలిగినట్లు తెలిపారు. మహిళల అవసరం మేరకు మరిన్ని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.